# దోమల దొరసాని

ప్రకృతిలో నోటివల్ల కీడు కలిగేది ఎవరికి? అన్న కొంటె ప్రశ్నకి కోణంగి సమాధానం పీపు కాదు. దోమకి. అది చెవిదగ్గర సంగీతం పాడుతూ తన వునికిని ప్రకటన చేయడంతో దాన్ని మనిషి చంపుతుంటాడు.

మన దేశం అంటే దోమలకి ఎంతో ప్రీతి. అందుకే మనుషుల జనసంఖ్య కన్నా భారతదేశంలో దోమల జనాభా అనేక రెట్లు అధికం. ఇందుకు ప్రధాన కారణం బ్యూరోక్రసితో నడిచే మన దేశంలోని మున్సిపాలిటీలనే చెప్పాలి.

దోమలవల్ల ఓ పెద్ద ఇండస్ట్రీ మనదేశంలో బతుకుతోంది. మస్కిటోకాయిల్స్, మస్కిటో రెపెల్లెంట్స్. దోమల నివారణ మందు ఓ పెద్ద పరిశ్రమే. దాదాపు ప్రతీ ఇంటివారు వీటిని కొంటుంటారు. దోమలు వేసవికాలంలో పెద్దగా వుండవు కాని అవి వీరవిహారం చేసేది వర్షాకాలం, శీతాకాలంలోనే.

మన దేశంలో మలేరియా, వైరస్ ఫీవర్లు సర్వసాధారణం. ఇవి దోమకాటువల్లే వ్యాప్తి చెందుతాయి. కాబట్టి దోమల వల్ల పార్మస్యూటికల్స్ పరిశ్రమ కూడా జీవిస్తోందనే చెప్పాలి. ప్రపంచంలో ఎక్కువ శాతం మనుషులు మరణించేది దోమకాటు వల్ల కలిగే అనారోగ్యాల వల్లే. మరే ఇతరాలు మనిషి చావుకి ఇంత బాధ్యత వహించడం లేదు. దోమకాటు వల్ల వచ్చే బోదకి ఇంతదాకా మందులేదు. అది భారతదేశానికే, అందులోనూ కొన్ని ప్రాంతాలకే పరిమిత మయిన వ్యాధి కాబట్టి దానికి విదేశస్థులు మందు కనుక్కోవడం నిర్లక్ష్యం చేశారు. మన దేశంలోని శాస్త్రజ్ఞులు అమెరికాలాంటి సంపన్న దేశాలకి తరలిపోతుంటారు. కాబట్టి ఇక్కడ ఎవరూ ఆ పనికి పూనుకోరు. ఇక్కడ ఆసక్తి ఉన్నవారికి తగిన ప్రోత్సాహం ప్రభుత్వం నించి ఉండదాయె.

దోమకాటువల్ల వంద రకాల రోగాలు వ్యాప్తి చెందుతున్నాయి.

అయితే అభివృద్ధి చెందుతున్న దేశాల్లోనే దోమల బెడద. అమెరికా, పశ్చిమ యూరప్‌లోని దేశాల్లో దోమలు ఉండవు. అక్కడి పారిశుధ్యత వల్ల దోమలు అభివృద్ధి చెందే అవకాశం లేదు. (ఇందాక చెప్పినట్లుగా) మనుషులకన్నా హాయిగా అభివృద్ధి చెందుతున్నాయి.

దోమల్లో 3,450 రకాలున్నాయి. మనిషేతర ప్రాణి ప్రపంచంలో మనుషుల్ని అధికంగా హింసించే ప్రాణి దోమే. అయితే మనిషిని కుట్టే దోమ కేవలం ఆడదోమే అన్న సంగతి అందరికి తెలియకపోవచ్చు. మొగదోమలు కుట్టవు. ఆడ దోమలు దోమలగుడ్లు తయారీకి అవసర మయిన ప్రోటీన్స్‌ని మనిషి రక్తంనించి సేకరించడానికి కుడుతుంటాయి ఒకసారి కుడితే అవి తాగే రక్తంలోని ప్రోటీన్స్ 500 గుడ్లు తయారీకి సరిపోతాయి అని శాస్త్రజ్ఞులు కనుక్కొన్నారు. అంచేత 'నన్నుదోచు కుందువటే దోమల దొరసాని' అని పాడుకోవచ్చు.

దోమలు మనుషులని కాళ్ళమీద, చేతుల మీదే కుడుతుంటాయి సాధారణంగా. మనిషిని అవి చిత్రంగా గుర్తిస్తాయి. మనిషి వదిలే కార్బన్ డయాక్సైడ్ వాయువు వల్ల, శరీరం చుట్టూ ఉండే వేడివల్ల మనిషి ఎక్కడున్నాడో పసికడతాయి. వాటి రెక్కలు క్షణానికి 500 సార్లు కొట్టుకుని అవి ఎగరడానికి సాయం చేస్తాయి. ఆ వేగం వల్ల దోమలు చేసే శబ్దం పుడుతుంది. అదే మనకి వినబడే దోమల సంగీతం. (ఈ వ్యాసం మొదట్లో పేర్కొన్నట్టుగా దోమల శబ్దం వాటి నోటివల్ల కాక రెక్కల వల్లే కలుతుంది.)

దోమలు ముందుకి, వెనక్కి, పైకి, కిందికి ఎగరగలగడమే కాక గాల్లో కదలకుండా కూడా నిలబడగలవు. దోమ నోటికున్న రంపాన్ని పోలిన రెండు పరికరాలతో మనిషి చర్మాన్ని కోసి, రెండు ట్యూబులని గాయంలోకి పోనించి మనం గోల్డ్‌స్పాట్ తాగినట్లుగా మన రక్తాన్ని ఓ ట్యూబ్‌తో తాగుతుంది. రెండో ట్యూబ్ లోంచి దాని ఉమ్మి గాయం మీదకి కారి రక్తం గడ్డకట్టకుండా చేస్తుంది. ఈ ఉమ్మిలోంచే మన రక్తంలోకి రోగ క్రిములు ప్రవేశిస్తాయి.

దోమలు చరిత్రలో కూడా చేసుకున్నాయి. 1802లో నెపోలియన్

సైన్యం 33000 మందిలో 29000 మంది దోమకాటువల్ల కలిగిన యెల్లో ఫీవర్‌తో మరణించారు. ఇది అమెరికాలో అప్పుడు ఫ్రెంచ్ ఆధీనంలో ఉన్న లూజియానాలో జరిగింది. 1905లో పనామా కాలువ నిర్మాణం కూడా దోమల వల్ల కొంత కాలం ఆగిపోయింది, వర్కర్స్ అంతా యెల్లో ఫీవర్‌కి గురవడంతో.

దోమ 9000 సార్లు కుడితే మనిషి శరీరంలోని రక్తం సగం పీల్చేసుకుంటుంది. దోమలు అధికంగా వున్న అడవుల్లోకి వెళ్ళేవారు ఇందుకే ప్రాణరక్షణగా మస్కిటో రెపెల్లెంట్స్ ఒంటికి పూసుకుని వెళ్తుంటారు. ప్రతి సైనికుడికి యుద్ధంలో ఇది తప్పనిసరిగా ఇస్తారు. ఇంతా చేస్తే దోమ బరువు 3 నుంచి 7 మిల్లీ గ్రాముల లోపే వుంటుంది. యుద్ధాల వల్ల పోయిన మనిషి రక్తం కన్నా దోమలవల్ల మనిషి పోగొట్టుకున్న రక్తమే అధికం అయుంటుందని నమ్మకం.

దోమలు మరణించాక దాని శరీరం నేల్లో కలిసిపోయి వృక్షజాతికి మేలుచేసే ఎరువుగా మారుతుందని రష్యన్ సైంటిస్టులు కనుకున్నారు.

కారణం లేకుండా భగవంతుడు ఏ జీవిని పుట్టించడు కదా! చిన్నప్పుడు మా అమ్మమ్మ దోమ గురించి చెప్పిన ఓ కథ ఇక్కడ ప్రస్తావిస్తాను.

ఓ రాజుగారు జీవకోటి వల్ల మనుషులకి కలిగే వుపకారం గురించి సర్వేచేసి, దోమ, సాలెపురుగులు మాత్రం మనిషికి ఏ మాత్రం ఉపకారం చేయకపోయినా అపకారం చేస్తాయని, వాటిని నిర్మూలించమని ఆజ్ఞాపించారట. కొద్దికాలంలో జరిగిన ఓ యుద్ధంలో ఆ రాజుగారు ఓడిపోయారు. అడవుల్లోకి పారిపోతే శత్రు సైనికులు తరుముకు వచ్చారు. అలసిపోయినా, రాజుగారు ఆ రాత్రంతా దోమలు కుట్టడంతో నిద్రపోలేదు. అర్ధరాత్రి శత్రు సైనికులు వస్తున్న అలికిడికి మెలకువగా ఉన్న రాజుగారు పసికట్టి దగ్గరే ఉన్న కొండ గుహలో దాక్కున్నారు. శత్రు సైనికులు ఆ గుహ బయట ఆగారు. ఏ క్షణంలోనైనా వాళ్ళు లోపలికి రావచ్చు. రాజుగారి ప్రాణం తీయొచ్చు. ఇంతలో ఓ సైనికుడు 'గుహ బయట సాలెగూడు చూడండిరా, రాజు లోపలికి వెళితే అది వుండేది కాదుగా'

అనడంతో లోపల రాజుగారు లేరనుకుని వెళ్ళిపోయారు. అప్పుడు రాజుగారు 'ఆహా, దోమలు కుట్టబట్టే మేలుకుని తప్పించుకున్నాను. సాలె పురుగు నేను గుహలోకి వచ్చాక అల్లిన గూడు వల్ల నా ప్రాణాలు నిలిచాయి' అనుకున్నాడు.

ఆయన ఏ జీవులవల్ల మనుష్యులకి ఉపయోగం లేదనుకున్నారో వాటివల్లే రక్షింపబడ్డాడు. అలా దోమ ప్రాముఖ్యత దోమది. మన మున్సిపాలిటీల వాళ్ళకి ఈ కథ ఒంటబట్టి వుండొచ్చు కాబట్టి వాళ్లు దోమల నివారణని మొక్కుబడిగా చేస్తుంటారు.

కవులు పూర్వకాలంలో 'హస్తి మసికాంతం' అని దోమని ఏనుగుని పోల్చారు. 'కుంజర యూథంబు దోమకుత్తుక జొచ్చెన్' అన్న పద్య పజిల్‌ని 'తెనాలి రామకృష్ణ' సినిమాలో రామకృష్ణుడు పూరిస్తాడు.

'ప్రేమ లేదు. దోమ లేదు' అంటుంటారు ప్రేమవల్ల కష్టం రాదన్న భయంకల మన పెద్దలు. అఫ్‌కోర్స్ దోమకుట్టని వాళ్ళయినా వుండవచ్చు కాని మనుషుల్లో ప్రేమ కుట్టని వాళ్ళంటూ వుండరు.

ఇలా దోమగారు మన జీవితంలో అనేక భాగాల్లో తన సీట్‌ని శాశ్వతం చేసుకున్నారు.

## ఏన్ ఎలిజీ టు ఎ బైక్

**1980** దాకా నాకు బండి అవసరం కలగలేదు. రోజూ ఆఫీసుకి వెళ్ళి రావడానికి నేను ఆడిట్ చేసే కంపెనీవారి వెహికల్ వస్తూండేది. లేదా అర్.టి.సి. బస్‌లో వెళుతుండేవాణ్ణి. తీరికవేళల్లో కథలు రాసుకుంటూ. ఆఫీసునించి ఇంటికి, ఇంటినించి ఆఫీసుకి మించి తిరగాల్సిన అవసరం అట్టే వుండేది కాదు. ఉన్నా ఆటోల్లో వెళుతుండేవాణ్ణి.

రచయితల నవలాయుగం ఆరంభం అయాక పెరిగిన వత్తిడులవల్ల, వ్యాపకాలవల్ల అనేక చోట్లకి వెళ్ళడానికి బండి అవసరం,